సాక్షి సూర్యాపేట

శనివారం : 27 : జనవరి : 2024



జిల్లా అభివృద్ధికి పాటుపడాలి
అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి పాటుపడాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. - 8లో



ప్రతి అవార్డు జన్మభూమికి అంకితం
ప్రతి అవార్డు కన్నతల్లి లాంటి వెల్లంకి గ్రామానికి అంకితమిస్తున్నట్లు మధుర కవి కూరెళ్ల విఠలాచార్య తెలిపారు. - 10లో



యాదాద్రిలో భక్తుల సందడి
యాదాద్రిలో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీస్వామిని దర్శించుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

విద్యార్థుల క్షేత్ర పర్యటన

మోతె: మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామ శివారులో గల విత్తనశుద్ధి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థులు సందర్శించారు. జామ, కొబ్బర వంటి తదితర నారు పెంపకాన్ని పరిశీలించారు. ఆ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఇక్కడకు వచ్చామని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎంటమాలజీ కోర్సు అధ్యాపకురాలు మమత, ఏఈఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్చక సంఘం ప్రెసిడెంట్‌గా ఫణికుమారశర్మ



నేరేడుచర్ల: రాష్ట్ర ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేరేడుచర్ల మండలం దిర్శించర్లకు చెందిన అన్నంబొట్ల ఫణికుమారశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జాభవన్ ధర్మశాలలో అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవాశర్మ అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో ఫణికుమార్ శర్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫణికుమారశర్మ మాట్లాడుతూ అర్చక సంఘం సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన అర్చక సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు శ్రీనివాస్



ప్రధాన కార్యదర్శి ఈశ్వర్

నడిగూడెం: గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నడిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకుడు కొల్లు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఫిజిక్స్ అధ్యాపకుడు నందిగామ ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కనకచంద్రం శుక్రవారం ఎన్నికైనట్టు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పలువురిని కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా చేపట్టారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. ఆండాళ్‌దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠించి ఊంజలి సేవ నిర్వహించారు. అంతకుముందు వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అభిషేకం, అర్చనలు జరిపించారు. ఇక ఆలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవలు గావించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం



- ఆరు గ్యారంటీ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యం
- అన్ని వర్గాలకు సమాన అవకాశాలు
- అభయహస్తం అర్జీల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశాం
- గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకట్రావు

"ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేందుకు జిల్లా యంత్రాంగం పనిచేస్తుంది. ప్రతి పౌరుడు హక్కులను వినియోగించుకుంటూ, బాధ్యతలను విస్మరించకుండా దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలి.
– జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధికార యంత్రాంగం అహర్నిశలు పనిచేస్తోందని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 75వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, జిల్లా అధికారులు, ఉద్యోగులకు, అనధికారులు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన మొదట్లో రాజ్యాంగం లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగిందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అధ్యక్షతన ఏర్పాటైన డ్రాఫ్టింగ్ కమిటీ ఆధ్వర్యంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, అప్పటి నుంచి ప్రతిఏటా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు.



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు తదితరులు

అమలులోకి మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ

రాష్ట్రంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే కొత్త ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణలో భాగంగా ఆరు గ్యారంటీలలో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా వంటి రెండు పథకాలను గతేడాది డిసెంబర్ 9న అమలులోకి తెచ్చామన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 21,32,860 ప్రయాణికులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం రూ.5 లక్షలు ఉన్న వైద్య సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తోందన్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలనలో అభయహస్తం గ్యారంటీల కోసం 475 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లో 141 వార్డు సభల ద్వారా స్వీకరించిన 3,76,419 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు.

రైతు భరోసాకు రూ.317.46 కోట్లు

ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసా పథకంలో భాగంగా యాసంగి 2023–24 సీజన్‌లో జిల్లాలోని మొత్తం 2,93,689 మంది రైతులకు రూ.317.46 కోట్లు కేటాయించిందన్నారు. దీంట్లో ఇప్పటి వరకు 1,79,450 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.96.76 కోట్లు జమ చేశామన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 2 లక్షల రూపాయల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, మండల కేంద్రాల్లో, ఆన్‌లైన్ ద్వారా ప్రజావాణి పేరుతో దరఖాస్తులను స్వీకరిస్తూ జిల్లాలోని ప్రజలు సమస్యల పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ

జిల్లాలోని 216 మహిళా సంఘాలకు వడ్డీలేని రూ.9.16 కోట్ల రుణాల పంపిణీ చేశారు. భానుపురి సమాఖ్యలోని 7,931 సంఘాలకు రూ.508.97 కోట్లు, 2,750 సంఘాలకు రూ.90.59 కోట్ల చెక్కులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ.వెంకట్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, ఏఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సన్మానం

గణతంత్ర వేడుకల్లో జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు శాదం వెంకట్‌రెడ్డి, గుడిపాటి అంజయ్య, టంగుటూరి కోటయ్య, బండ పుల్లారెడ్డిలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు.





జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకల్లో వివిధ పాఠశాలకు చెందిని విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమాలను కలెక్టర్, ఎస్పీ తిలకిస్తూనే ఫొటోలు దిగుతూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి అభినందించారు. తర్వాత పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలచే ఏర్పాటు చేసిన 14 స్టాళ్లను తిలకించారు.



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

అభివృద్ధికి పాటుపడాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపల్ పాలక మండలి ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 75వ గణతంత్ర వేడుకలకు మంత్రి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నీలుగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కౌణతం చిన వెంకట్‌రెడ్డి, రణపంగ నాగయ్య, ఎస్‌కె షహనాజ్, ఎస్‌కె బాషా, అలక సరితసైదిరెడ్డి, తాళ్లూరి సాయి, అమరారపు లలిత, సూకల సుగుణ, బచ్చలకూరి ప్రకాశ్, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, వేమూరి నాగవేణి, సులోచన పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల: భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధా న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్ పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి

• 'జన'పహాడ్



పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు రెండో రోజు శుక్రవారం గంధోత్సవానికి తరలివచ్చిన భక్తజనం



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేడు 'పేట'లో అవిశ్వాస తీర్మానం

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ల అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- క్యాంపుల నుంచి నేరుగా రానున్న కౌన్సిలర్లు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్‌కు మార్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన కాపీని కలెక్టర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. తీర్మాన కాపీని పరిశీలించిన కలెక్టర్ ఎస్.వెంకట్రావు గురువారం పాలక మండలి సభ్యులకు ప్రత్యేక నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను కమిషనర్ రామానుజుల రెడ్డి కౌన్సిల్ సభ్యుల ఇళ్లకు చేరవేశారు.

పార్టీల బలాబలాలు	
ప్రస్తుతం బీఆర్ఎస్ కౌన్సిలర్లు 15	
బీఆర్ఎస్‌ను విభేదించింది 15	
కాంగ్రెస్ 09	బీజేపీ 04
బీఎస్పీ 04	47వ వార్డు ఖాళీ

ఉదయం 11 గంటలకు ఓటింగ్..

32 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రకారం శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం 1 గంటకు వైస్ చైర్మన్‌పై ఓటింగ్‌ను నిర్వహించాలని కౌన్సిలర్లకు అందజేసిన ప్రత్యేక నోటీసుల్లో ఉంది. ఈమేరకు సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరై చేతులెత్తితేనే అవిశ్వాసం నెగ్గినట్లవుతుంది.. లేదంటే అవిశ్వాసం వీగిపోతుంది.



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కుర్చీలు

క్యాంపుల నుంచి నేరుగా..

అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకునేందుకు జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపటేల్ రమేష్‌రెడ్డిల నేతృత్వంలో కౌన్సిలర్లు హైదరాబాద్, కర్ణాటక క్యాంపులకు తరలివెళ్లారు. వీరందరూ శనివారం సమావేశం సమయానికి నేరుగా హాజరుకానున్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోతుందని తన వద్ద ఉన్న కౌన్సిలర్లకు మనోధైర్యం నింపుతున్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన 24 మంది కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు. విప్‌జారీ చేసిన పత్రాలను ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్‌లో అందజేశారు. అవిశ్వాస ప్రక్రియను ఇరు వర్గాలు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఉత్కంఠ నెలకొంది.

కోదాడలోనూ నేడే..

కోదాడ: బీఆర్ఎస్‌కు చెందిన కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్ వెంపటి పద్మపై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై శనివారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తమ్మరకు చెందిన కౌన్సిలర్ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం 25 మంది కౌన్సిరల్లు క్యాంపునకు వెళ్లారు. శనివారం జరిగే అవిశ్వాస సమావేశానికి వీరు క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి వస్తారని సమాచారం. మున్సిపాలిటీలో మొత్తం 34 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన దాదాపు 26 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గితే ప్రస్తుత చైర్‌పర్సన్ స్థానంలో తమ్మరకు చెందిన 4వ వార్డు కౌన్సిలర్ సామినేని ప్రమీల చైర్‌పర్సన్‌గా, 6వ వార్డుకు చెందిన కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

చైర్మన్ రేసులో కొండపల్లి నిఖిల?

మున్సిపల్ చైర్మన్ రేసులో 32వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలదిలీప్‌రెడ్డి ఉంది. వైస్ చైర్మన్ రేసులో కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, కక్కిరేణి శ్రీనివాస్, షేక్ జహీర్, పొలగాని కవితబాలుగౌడ్, బైరు శైలేందర్‌గౌడ్‌లు ఉన్నట్లు సమాచారం.

ఎంప్లాయ్ ఐడీ క్రియేట్‌కు రూ.3వేలు!

- వీఆర్‌ఏల నుంచి వసూలు
- కోదాడలో ఓ అధికారి నిర్వాకం

కోదాడ: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా' మారింది వీఆర్‌ఏల పరిస్థితి. గత ప్రభుత్వం వీఆర్‌ఓల వ్యవస్థను రద్దు చేసిన తర్వాత విద్యార్హతలను బట్టి వారిని అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లుగా నియమించి స్కేల్ పోస్టు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. ఈ లోపే ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ వాయిదా పడింది. దీంతో ఆరు నెలలుగా వారికి వేతనాలు అందట్లేదు. ఇటీవలే ప్రభుత్వం దయతలిచి వారికి వేతనాలు మంజూరు చేసింది. వీరు స్కేల్ పోస్టులోకి రావడంతో ఎంప్లాయ్ ఐడీని ట్రెజరీ కార్యాలయం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కోదాడలోని ఎస్ఎస్‌పీ క్యాంపు ఆవరణలో ఉన్న సదరు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి తనకు రెండు శాతం కమిషన్ ఇస్తేనే ఎంప్లాయ్ ఐడీ క్రియేట్ చేసానని, వేతనాల బిల్లు చేస్తానని డిమాండ్ చేస్తున్నాడు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన దాదాపు 120 మందికిగాను ఒక్కొక్కరి నుంచి రూ.3వేల చొప్పున వసూలు చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. అంత ఇవ్వలేమని పలువురు బతిమిలాడుకోవడంతో చివరకు రూ.2,500 ఇవ్వాలంటున్నాడని పలువురు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వీఆర్‌ఏలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

కోదాడ ట్రెజరీ కార్యాలయంలో వీఆర్‌ఏలకు ఎప్లాయ్ ఐడీ క్రియేట్ చేయడానికి రూ.మూడు వేలు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అలాంటి ఏమైనా ఉండి నిర్దిష్టంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
– రవి, జిల్లా ట్రెజరీ అధికారి

ఢిల్లీ పరేడ్‌లో డప్పు కళాకారిణి అజిత



ఇతర రాష్ట్రాల కళాకారులతో కొత్తపల్లి అజిత

మఠంపల్లి: మండలంలోని హనుమంతులగూడేనికి చెందిన డప్పు కళాకారిణి కొత్తపల్లి అజిత శుక్రవారం ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రదర్శించిన చాకలి ఐలమ్మ శకటంపై డప్పు వాయించి సత్తాచాటి అందరి దృష్టిని ఆకర్షించింది. అజిత తన భర్త శ్రీధర్ సహకారంతో కొంతకాలంగా డప్పు కళాకారిణిగా రాణిస్తుంది. రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌లో అజిత పాల్గొనడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు. చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే


డ్యాన్స్ చేస్తున్న మఠంపల్లి ఎస్‌సీఎల్ విద్యార్థులు


సూర్యాపేట టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మహిళా కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన


డ్యాన్స్ చేస్తున్న సిరిపురం విద్యార్థులు

ఉత్తమ సేవలకు అవార్డులు

సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ఎస్.వెంకట్రావు ప్రశంస పత్రాలు అందజేశారు.


గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్ ప్రియాంక


అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి


నాగేశ్వర్‌రావు, ఏఎస్పీ


రాంపంగు మల్సూర్, టీపీ సూర్యాపేట మండలం


సూర్యానారాయణ, ఆర్డీఓ, కోదాడ


జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ, హుజూర్‌నగర్


వెంకటేశ్వర్లు, సీపీఓ


మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ అధికారి


రాంపతి నాయక్, డీఎం సివిల్ సప్లయ్ · అశోక్, డీఈఓ · గఫార్ అహ్మద్, ఈడీఎం · రూపేందర్‌సింగ్, జిల్లా మత్స్యశాఖ అధికారి · సతీష్‌కుమార్, డీఎఫ్ఓ · శ్రీధర్, జిల్లా సహకారశాఖ అధికారి · శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ అధికారి · ప్రేమ్‌చంద్, డీసీఈ, ఇరిగేషన్ · నాగేశ్వర్, మైనార్టీ అధికారి · అనిత, ఎక్సైజ్ అధికారి · రమేష్‌కుమార్, డీపీఆర్ఓ · సురేష్, జెడ్పీ సీఈఓ


జ్యోతిపద్మ, సంక్షేమ అధికారి · రవి కుమార్, డీటీఓ · శంకర్, గిరిజన అభివృద్ధి అధికారి · నాగేందర్, జిల్లా సర్వే అధికారి · మల్లేశం, డిప్యూటీ ఈఈ ఐఅండ్ పీఆర్ · జ్యోతిలక్ష్మి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ · శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్, కలెక్టరేట్ · వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్, కలెక్టరేట్ · పద్మారావు, సూపరింటెండెంట్, కలెక్టరేట్ · శ్రావణి, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ · మహేష్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ · వినయ్, హెచ్‌హెచ్‌పీ · రఘు, హెచ్‌హెచ్‌పీ


అన్వర్, కలెక్టర్ ఆఫీస్ సబార్డినేట్ · నాగేశ్వర్‌రావు, సీసీ టు కలెక్టర్ · గోవర్ధన్, గన్‌మెన్, కలెక్టర్ · శ్యాసుందర్‌రెడ్డి, తహసీల్దార్, సూర్యాపేట · లింగయ్య, పీపీ · కృష్ణ, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ · వనజ, ఎంపీడీఓ, గరిడేపల్లి · దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి · జోత్స్న, జూనియర్ లెక్చరర్, కోదాడ · ఉషారాణి, అగ్రికల్చర్ టెక్నికల్ అధికారి · నాగలక్ష్మి, డీటీ, సివిల్‌సప్లయ్ · శివరంజని, అంగన్వాడీ టీచర్, కోమటిపల్లి · కళావతి, సీఎస్ ఆర్ఎంఓ


లక్ష్మీకాంతమ్మ, సీనియర్ అసిస్టెంట్, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీస్ · అనంతరావు, హెచ్‌డబ్ల్యుఓ, సూర్యాపేట · బాలాజీ, డిప్యూటీ ఎస్ఓ · రత్నప్రసాద్, జూనియర్ అసిస్టెంట్, సూర్యాపేట మున్సిపాలిటీ · ప్రవీణ్ కుమార్, హెచ్ఆర్ఎం · శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ · రత్నయ్య, డీపీఎం · సాంబిరెడ్డి, డీఎల్‌పీఓ · నరేష్, ఫొటోగ్రాఫర్ · జహంగీర్, సీనియర్ ఆడిటర్ · నాగరాజు, డీఆర్‌పీ · రాజశేఖర్, సీఐ, సూర్యాపేట టౌన్ · సాయి కుమార్, ఎస్ఐ, సూర్యాపేట రూరల్


అయిలయ్య, ఎస్ఐ, డీఎస్‌బీ సూర్యాపేట · జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్ఐ, ఆపరేషన్ స్మైల్ · నవీన్‌కుమార్, ఎస్ఐ, సూర్యాపేట · వీరయ్య, ఎస్ఐ, డీఎస్‌బీ సూర్యాపేట · శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ · వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్, కోదాడ · వెంకన్న, కానిస్టేబుల్, మద్దిరాల · మహేష్, కానిస్టేబుల్ · వీరబాబు, హెడ్ కానిస్టేబుల్ · అబీద్, కానిస్టేబుల్ · శ్రీను, ఏఆర్ కానిస్టేబుల్ · హఫీజ్‌ఖాన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ · ప్రమీలా శ్రీపతిరెడ్డి, రెడ్ క్రాస్ డైరెక్టర్

తాళం వేసిన ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

మునగాల(కోదాడ): గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మునగాల మండల పరిధిలోని ఎస్ఎంపేటలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఎంపేట గ్రామానికి చెందిన మండపల్లి అరుణ్‌కుమార్ కొంత కాలంగా ఖమ్మం పట్టణంలో వ్యాపారం నిమిత్తం ఉంటున్నాడు. శుక్రవారం అరుణ్‌కుమార్ ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో బాధితుడు ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లోని వస్తువులు చిందవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు, 12తులాల వెండి ఆభరణాలతో పాటు ఓ సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో తేనీటి విందు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి సమీకృత కలెక్టరేట్‌లో తేనీటి విందు నిర్వహించారు. కలెక్టర్ వెంకట్రావ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అదనపు కలెక్టర్ ఏ. వెంకటరెడ్డితో కలిసి తిలకించారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సంక్షేమ అధికారి జ్యోతిపద్మ, డీటీడీఓ శంకర్, డీఏహెచ్ఓ శ్రీనివాస్, డీఎస్ఓ మోహన్‌బాబు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ కృష్ణయ్య, డీఎస్పీ నాగభూషణం, వైద్యాధికారి కోటాచలం, మున్సిపల్ కమిషనర్ రామనుజులరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పాటుపడాలి

- అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా అభివృద్ధికి అధికారులు పాటుపడాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరు పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జ్యోతి పద్మ, జిల్లా పశు వైద్య అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

సూర్యాపేట క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే జాతీయ పతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ట్రెనీ ఐపీఎస్ రాజేష్, మీనా, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఉప సర్పంచ్ మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

నిడమనూరు: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం మార్లగడ్డ క్యాంపు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ గొడితి శ్రీనివాసరావు(52) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మార్లగడ్డ క్యాంపునకు చెందిన గొడితి శ్రీనివాసరావు, తన పెద్ద కుమారుడు కిరణ్‌తో కలిసి శుక్రవారం ఇంటి సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బంచింగ్ కేబుల్ లాగుతున్నారు. ఈ క్రమంలో బంచింగ్ కేబుల్‌కు ఉన్న అల్యూమినియం వైరు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైరుకు తగలడంతో విద్యుత్ సరఫరా అయి దానిని పట్టుకున్న శ్రీనివాసరావు, కిరణ్ విద్యుదాఘాతానికి గురయ్యారు. బురద మడిలో ఉన్న శ్రీనివాసరావుకు తీవ్ర, పొలం గట్టు మీద నుంచి వైరు లాగుతున్న ఆయన కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గొడితి శ్రీనివాసరావు మృతిచెందగా, కిరణ్ కోలుకుంటున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిర్యాలగూడలో పాలస్తీనా జెండాల ప్రదర్శన

- సోషల్ మీడియాలో వైరలైన దృశ్యాలు
- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


పాలస్తీనా జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు

మిర్యాలగూడ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో కొందరు యువకులు పాలస్తీనా దేశానికి చెందిన జెండాలు ప్రదర్శించారు. నలుగురు(విద్యార్థులు) యువకులు మిర్యాలగూడ పట్టణంలోని బ్లూ వెల్ ప్యాలెస్ భవనం మెట్లపై నిలబడి పాలస్తీనాకు చెందిన రెండు జెండాలను పట్టుకుని ప్రదర్శించారు. వారు ప్రదర్శిస్తున్న సమయంలో తమ స్నేహితులతో వీడియో, ఫొటోలు తీయించుకున్నారు. ఆ సమయంలో సమీపంలో కొందరు యువకులు ఆ దృశ్యాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటగిరి యువకులను విచారిస్తున్నారు. ఒక వైపు గణతంత్ర వేడుకల్లో పట్టణ వాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండగా అదే సమయంలో యువకులు పాలస్తీనా జెండాలను ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. పాలస్తీనా జెండాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యామ్ డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కనగల్ : గుర్తుతెలియని వ్యక్తులు పోలీస్‌క్వార్టర్స్‌లో ఉన్న ట్రాక్టర్ బ్యాటరీని చోరీ చేశారు. కనగల్ మండలం బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన కారింగు నర్సింహ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నాడని వారం రోజుల క్రితం అతని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచారు. అతడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌క్వార్టర్స్‌లో ఉంచారు. నర్సింహ గురువారం మైనింగ్ కార్యాలయం నుంచి రిలీజ్ ఆర్డర్ తీసుకుని ట్రాక్టర్‌ను తీసుకెళ్లేందుకు వచ్చాడు. ట్రాక్టర్‌ను తీసే క్రమంలో బ్యాటరీ కనిపించకపోవడంతో నర్సింహ పోలీసులను ఆశ్రయించాడు. తమకు పట్టనట్లుగా ఉంటున్నారని బాధితుడు వాపోయాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పిలాయిపల్లి కాలువలోకి వ్యర్థ రసాయనాలు

భూదాన్‌పోచంపల్లి: మండల శివారులోని మైసమ్మ కత్వ సమీపంలో గల పిలాయిపల్లి కాలువలో గురువారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ రసాయనాలు పారబోస్తున్న కెమికల్ ట్యాంకర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోచంపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డులో మైసమ్మ కత్వ సమీపంలో గల పిలాయిపల్లి కాలువ వద్ద కొందరు ట్యాంకర్‌ను ఆపి వ్యర్థ రసాయనాలను కాలువలోకి వదులుతుండగా రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు సాయికుమార్, వినోద్‌కుమార్ గమనించారు. దగ్గరికి వెళ్లి చూడగా ఘాటైన దుర్వాసన వస్తుండటంతో ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తుండగా వారు అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే పోలీసులు అటుగా పోచంపల్లికి వెళ్తున్న ఆదిమూలం శ్రీనివాస్, నోముల పాండుతో పాటు మరో ఇద్దరు వాహనదారుల సాయంతో కెమికల్ ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు ఇన్నోవా క్రిస్టా కారులో వచ్చిన మరో వ్యక్తిని పట్టుకున్నారు. అనంతరం ట్యాంకర్, కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కారులో వచ్చిన వ్యక్తిని పోలీసులు ప్రశ్నించగా.. తన పేరు తానం సంపత్‌రెడ్డి అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సూరారం కాలనీలో ఉంటున్నట్లు తెలిపాడు. ట్యాంకర్ డ్రైవర్ బిహార్‌కు చెందిన దీపుయాదవ్‌గా గుర్తించారు. వీరు జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాల నుంచి ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను తీసుకొచ్చి పిలాయిపల్లి కాలువలో పారబోస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.